సాక్షి చిత్తూరు

గురువారం । 19 । డిసెంబర్ । 2024



అభ్యుదయ యోజనపై సమీక్ష

పీఎం అనుసుచిత జాతి అభ్యుదయ పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ తెలిపారు. - 8లో



గుమ్మాలు కొట్టడం కక్ష సాధింపే

వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్ల గుమ్మాలు కొట్టేయడం కూటమి ప్రభుత్వానిది కక్షసాధింపే అని భూమన ఆరోపించారు. - 8లో



ఒంటరి ఏనుగు సంచారం

బంగారుపాళెం మండలం మొగిలి శివపార్వతుల గోశాల వద్ద ఏనుగు సంచరించినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఇంటి స్థలాలపై విజిలెన్స్ విచారణ



భూములు ఇచ్చిన రైతులను విచారిస్తున్న విజిలెన్స్ ఎస్‌ఐ రామకృష్ణ నాయక్

రొంపిచెర్ల: మండలంలో గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాలకు కొనుగోలు చేసిన భూములపై విజిలెన్స్ ఎస్‌ఐ రామకృష్ణ నాయక్ బుధవారం విచారణ చేశారు. రొంపిచెర్ల పంచాయతీ గానుగచింత రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద, డంపింగ్ యార్డు పక్కన, జాండ్లవారిపల్లె పంచాయతీ కస్పా పక్కన గత ప్రభుత్వం సుమారు 14 ఎకరాలు కొనుగోలు చేసింది. ఆ భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సక్రమంగా అందాయా ? లేదా ? అని విచారించారు. ప్రభుత్వం నేరుగా తమ బ్యాంక్ ఖాతాల్లోకి డబ్బులు వేసిందని రైతులు తెలిపారు. ఇళ్ల పట్టాలు విక్రయాలు ఏమైనా జరిగాయా? అని కూడా విచారణ చేశామని.. ఏవీ అవకతవకలు జరగలేదని విచారణ అధికారులు తెలిపారు.

ఏఆర్‌టీ సెంటర్‌లో తనిఖీలు



సిబ్బందితో మాట్లాడుతున్న జేడీ మంజుల

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఏఆర్‌టీ సెంటర్ నిర్వహణలో అపోలో సంస్థతో సంబంధం వద్దని ఏపీఎస్‌ఏసీఎస్ జేడీ మంజుల ఆదేశించారు. చిత్తూరు నగరం ప్రభుత్వ ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఏఆర్‌టీ సెంటర్ నిర్వహణలో అపోలో వాళ్లతో సంబంధం లేకుండా ప్రభుత్వం తరఫున చేపట్టాలన్నారు. వచ్చే నెల సెంటర్ నిర్వహణ విధివిధానాలను వెల్లడిస్తానన్నారు. అనంతరం ఆ సెంటర్ కింద ఎంతమంది హెచ్‌ఐవీ బాధితులు ఉన్నారు ? వారికి ఏరకమైన సేవలు అందుతున్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, వైద్యులు అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఉద్యోగులను తొలగిస్తాం



రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్

కుప్పం: కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న పలువురు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లి ఇప్పటి వరకు విధులకు హాజరు కాలేదని వర్సిటీ రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ అన్నారు. అయితే అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తూ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన ఉద్యోగులు డిసెంబర్ 28వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు విధుల్లో చేరకపోతే వారిని శాశ్వతంగా తొలగించడం జరుగుతుందన్నారు. పలువురు ఉద్యోగులు నెలల పాటు సెలవు పెట్టి, పొడిగించుకుంటున్నారని, మరికొందరు ఉద్యోగులు ఆరోగ్య పరిస్థితులు, సొంత పనుల నిమిత్తం దీర్ఘకాలికంగా సెలవులు పెట్టి విధులకు రావడం లేదన్నారు. అలాంటి వారు కాకపోతే వారిని శాశ్వతంగా వర్సిటీ నుంచి తొలగిస్తామన్నారు. ఈ మేరకు వర్సిటీలోని అన్ని విభాగాధిపతులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రతి విద్యార్థికి పదోతరగతి జీవితంలో ఎదగడానికి తొలిమెట్టు. ఇక్కడ ప్రతిభ చూపితే జీవితానికి భరోసా గ్యారెంటీ అనేలా సాధన చేస్తారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు ఈసారి సిలబస్ మారడంతో కాస్త తడబడుతున్నారు. జిల్లావ్యాప్తంగా సర్కారు బడుల్లో అత్యున్నత ఫలితాలు సాధించేలా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మారిన సిలబస్ దృష్ట్యా మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాలోని పలు ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు కొరత ఉండడంతో సర్దుబాటు చేసి పాఠాలు బోధిస్తున్నారు.



గుడుపల్లి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్



స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులు

శత ప్రణాళిక..
పదిలమేనా..!

2025 మార్చి 17 నుంచి 31 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

- స్కూళ్లలో వంద రోజుల ప్రణాళిక అమలు
- మారిన సిలబస్, పరీక్ష విధానం, మెలకువలు సూచిస్తున్న టీచర్లు
- సర్కారు స్కూళ్లల్లో ఉత్తమ ఫలితాల సాధనకు పటిష్ట చర్యలు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ఉత్తీర్ణతశాతం పెంపునకు కృషి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో డిసెంబర్ నెల నుంచి మార్చి వరకు వందరోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. అలాగే ఆయా సబ్జెక్టుల టీచర్లు విద్యార్థులకు ప్రత్యేక సూచనలు ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. 2025 సంవత్సరం మార్చి 17వ తేదీ నుంచి మార్చి 31 వరకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పరీక్షల షెడ్యూల్‌ను సైతం రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇటీవల విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా 353 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం పది పరీక్షలకు 21,100 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

గణిత సూత్రాలపై పట్టుముఖ్యం..



గణిత పాఠ్యాంశాల్లోని సూత్రాలపై పట్టు సాధిస్తే ఎక్కువ మార్కులు పొందేందుకు వీలుంటుంది. విశ్లేషణాత్మకంగా రాయండి అని అడిగితే సూత్రాలతో వివరించాల్సి ఉంటుంది. సూత్రాలు, త్రిభుజాలను ప్రత్యేకంగా బాగా నేర్చుకోవాలి. వాస్తవ సంఖ్యల నుంచి సమితి నిర్మాణ రూపం, రోస్టర్ రూపంలోకి మార్చడం వంటి అంశాలపై ప్రశ్నలు అడుగుతారు. నిష్పత్తుల సమస్యలు సాధించడం. పటం ఘన పరిమాణం, అలాగే ఉపరిత వైశాల్యం కనుక్కోవడం. రేఖీయ సమీకరణాలను సాధించడం. అంకశ్రేణి లేదా గుణశ్రేణి నుంచి ప్రాథమిక సమస్యలు, సాంఖ్యకశాస్త్రం నుంచి కొన్ని ప్రాథమిక సమస్యలపై ప్రశ్నలు ఇస్తారు. **– గంగప్రసాద్‌రాజు, గణిత ఉపాధ్యాయులు, పెద్ద పంజాణి మండలం**

భౌతికమంటే భయం వద్దు



భాష్పీభవనం, మరుగుటకు భేదాలు, హ్రస్వదృష్టి, దీర్ఘ దృష్టి లోపాల సవరణ, ఎండమావులు, ఇంద్రధనస్సు ఏర్పడే విధానం, విద్యుత్తు మోటారు, ఏసీ జనరేటర్, డీసీ జనరేటర్ పనిచేయు విధానం, క్వాంటాం సంఖ్యలు, పౌలీ అఫ్‌బే, హుండ్ నియమాలు, నూతన ఆవర్తన పట్టిక నిర్మాణం. ఘన పదార్థపు విశిష్టోష్ణం కనుగొనడం, గాజులదిమ్మె, పట్టకం వక్రీభవన గుణకాలు, ఆమ్ల రసాయన చర్యలకు సంబంధించిన ప్రయోగాలు, స్పటిక జలం కృత్యం, ఆల్కహాల్, గ్లూకోజ్ ఆమ్లాలు చదువుకోవాలి. ఆమ్లాలు–క్షారాలు, పరమాణు నిర్మాణం తదితర వాటిపై పట్టు సాధించాలి.

– మంజునాథగుప్త, భౌతికశాస్త్రం ఉపాధ్యాయులు, కుప్పం మండలం

ప్రశ్నలు	మార్కులు
ఒక మార్కు ప్రశ్నలు 6	06
రెండు మార్కుల ప్రశ్నలు 4	08
మూడు మార్కుల ప్రశ్నలు 4	12
ఎనిమిది మార్కుల ప్రశ్నలు 3	24

తెలుగు సులువే..



పరిచిత పద్యాలకు సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి. శతక మాధుర్యంలో పద్యాలకు భావాలు నేర్చుకోవాలి. రామాయణంలోని కాండలు (ప్రధాన అంశాలు), వ్యాసరూప ప్రశ్నలపై పట్టు పెంచుకోవాలి. అపరిచిత గద్యాలు, విభాగంలో సంభాషణ, ప్రకటన, కరపత్రం, గేయం, కవితల్లో ప్రశ్నలు వస్తుంటాయి. లఘు ప్రశ్నలైన కవి పరిచయాలు, ప్రత్యక్షదైవాలు, జలియన్ వాలాబాగ్, ప్రకృతి సందేశంలోని కథానిక, కథ, వ్యాసాలపై సాధన చేయాలి. అలంకారాలను బాగా నేర్చుకోవాలి. బహుళైచ్ఛిక ప్రశ్నలు చదవాలి. **– చంద్ర నరేష్, తెలుగు ఉపాధ్యాయులు, కాణిపాకం, ఐరాల మండలం**

అంశం	వచ్చే మార్కులు
అవగాహన ప్రతిస్పందన	32
వ్యక్తీకరణ–సృజనాత్మకత	36
భాషాంశాలు	32

హిందీపై ప్రత్యేక శ్రద్ధ



హిందీ పలకడం వచ్చినప్పటికీ రాయడం సాధన చేస్తే సులువుగా ఉంటుంది. వ్యాకరణ అంశాలు నిత్యం అభ్యాసం చేయాలి. పరిచయాలు నేర్చుకోవాలి. గద్య భాగంలోని రచయితల పరిచయాలు సాధన చేయాలి. ఆధునిక పద్య భాగ సారాంశాలు నిత్యం చదవాలి గద్య భాగ సారాంశాలు నేర్చుకోవాలి. పత్రలేఖన్‌లో ఔపచారిక్ లేదా అనౌపచారిక్ పత్రలతో ఏదో ఒకటి నేర్చుకుంటే ఉత్తమ మార్కులు పొందవచ్చు. వాక్య దోషాలు, వ్యాకరణ దోషాలు లేకుండా రాస్తే మార్కులు ఎక్కువగా సాధించవచ్చు.

– సత్యవతి, హిందీ టీచర్, కత్తెరపల్లి జెడ్పీ హైస్కూల్, కార్వేటినగరం మండలం

అంశం	వచ్చే మార్కులు
భాషాకి బాత్	12
అర్థ్ గ్రాహ్యత– ప్రతిక్రియ	20
కవుల జీవిత చరిత్ర	08
ఉపవాచకం (8 ప్రశ్నలు)	24
పద్య, గద్యభాగం (4 ప్రశ్నలు)	20
ఆరవ విభాగం	16

సాంఘిక శాస్త్రం సులువే



సాంఘిక శాస్త్రంలో చరిత్రను అర్థం చేసుకుని, రాజులపాలన గుర్తుంచుకుని, ప్రపంచ, దేశ చిత్రపటంపై పట్టు సాధిస్తే అధికమార్కులు పొందేందుకు అవకాశం ఉంటుంది. భారతదేశ ప్రధాన భౌగోళిక స్వరూపాలు, పర్యావరణ ఉద్యమాలు, నేలలు రకాలు, వ్యవసాయ పద్ధతులు, చరిత్రలో జాతీయోద్యమాలు, జాతీయాదాయం, తలసరి ఆదాయం, జల వనరులు, సంస్కృతి, ఆధునికత, ప్రపంచీకరణ వాటి పరిణామాలు, భారత ఆర్థిక వ్యవస్థ వివిధ రంగాలు వంటి అంశాలపై పట్టు సాధించాలి. ప్రపంచపటం, భారతదేశపటం గుర్తించేటప్పుడు సెక్షన్, మ్యాప్ ప్రశ్న నంబరు స్పష్టంగా రాయాలి. రాజ్యాంగం మౌలిక లక్షణాలపై పట్టు పెంచుకోవాలి.

– మురళి, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు, చౌడేపల్లి మండలం

అంశం	మార్కులు
సమాచార, పట నైపుణ్యాలు	30
ఇతర అంశాలు	70

[redacted]

జీవశాస్త్రం గంటన్నర..

[redacted]



ప్రశ్నాపత్రం ఒక్కటే అయినప్పటికీ జవాబుపత్రాలు భౌతికశాస్త్రం, జీవశాస్త్రం వేర్వేరుగా ఇస్తారు. వివిధ వ్యవస్థలకు సంబంధించి డాక్టర్‌ను అడగాల్సిన ప్రశ్న ఒకటి ఇచ్చే అవకాశం ఉంది. మానవుడు శ్వాస తీసుకోవడం విషయం చదవాలి. ఆయుర్వేద మొక్కలు–వీటి ఉపయోగాలపై ప్రశ్న ఉంటుంది. అవయవదానం, రక్తదానం, బాల్య వివాహాల నియంత్రణ, పర్యావరణ రక్షణ, నీటి సంరక్షణ, చెట్ల సంరక్షణపై స్లోగన్స్ పునశ్చరణ ముఖ్యం. ముఖ్యంగా గుండె, నిర్మాణం, ఫలదీకరణ విధానంపై దృష్టి పెట్టాలి. **– అహ్మద్ షరీఫ్, బయాలజీ టీచర్, నింద్ర మండలం**

ప్రశ్నలు	మార్కులు
ఒక మార్కు ప్రశ్నలు 6	06
రెండు మార్కుల ప్రశ్నలు 4	08
నాలుగు మార్కుల ప్రశ్నలు 5	20
ఎనిమిది మార్కుల ప్రశ్నలు 2	16

ఆంగ్లమంటే ఆందోళనే వద్దు




ఆంగ్ల పుస్తకంలోని గ్రామర్, ఒకాబ్యూలరీలను బాగా నేర్చుకోవాలి. దీంతో పాటు ప్రోస్, పోయట్రీలోని పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటే మంచి మార్కులు పొందవచ్చు. బార్, ట్రీ డయాగ్రామ్స్ ఎక్కువ నేర్చుకోవాలి. డైరీ ఎంట్రీ, పద సమూహ ప్రశ్నలపై దృష్టి సారించాలి. లాంగ్వేజ్ స్కిల్స్ ముఖ్యం. బయోగ్రాఫికల్ స్కెచ్, ఇన్ఫర్మేషన్ ట్రాన్స్‌ఫర్ ప్రశ్నలు ఇస్తారు. వీటిని బాగా నేర్చుకుంటే మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు. డయాగ్రమ్ ఇచ్చి స్టేట్‌మెంట్ రాయండి అనే ప్రశ్న అడుగుతారు. యాక్టివ్, పాసివ్ వాయిస్ నుంచి ఎక్కువగా స్టేట్‌మెంట్ నుంచి ప్రశ్నలు వస్తాయి. పాఠ్యపుస్తకంలోని 92వ పేజీ, 192వ పేజీల్లోని పదాలు చదవాలి. **– వేణుగోపాలుడు, ఇంగ్లిష్ టీచర్, గుడుపల్లి మండలం**

విభాగం	ప్రశ్నలు	మార్కులు
1	35	30
2	17	40
3	03	30

గత ఎన్నికల ప్రచారానికి చిత్తూరు జిల్లాకు వచ్చిన చంద్రబాబు గత ప్రభుత్వంలో నిత్యావసరాల ధరలు పెరిగేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే నిత్యావసర వస్తువుల ధరలకు కళ్లెం వేస్తామని మాటిచ్చారు. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో ఏది కొనాలన్నా భయపడే పరిస్థితి ఏర్పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉల్లి ధరలు పెరిగినప్పుడల్లా మార్కెటింగ్ శాఖ ద్వారా రైతుబజార్లలో ధరలను తగ్గించి ప్రజలకు విక్రయాలను చేసింది. ఈ ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖ ద్వారా ఉల్లి విక్రయాలు చేస్తామని చెప్పి తూతూమంత్రంగా అక్కడక్కడ నాలుగురోజులు పాటు అమ్మి ఆపై చేతులెత్తేశారు. దీంతో సగటు సామాన్యులు ఉల్లి, వెల్లుల్లి కొనలేక జనం బెంబేలెత్తున్నారు.





ఉల్లి లేని వంట..
వెల్లుల్లి కొనలేమంట

- నాలుగు నెలలుగా ఉల్లి ధరల మధ్య వ్యత్యాసం
- వర్షాలకు పెరగొచ్చంటున్న వ్యాపారులు
- మహారాష్ట్ర, కర్ణాటకల్లో భారీగా తగ్గిన ఉల్లి ఉత్పత్తి
- ప్రస్తుతం మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.70, కిలో వెల్లుల్లి రూ.400
- కొనేందుకు భయపడుతున్న సగటు సామాన్యులు
- చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం

పలమనేరు: తుపానుల కారణంగా ఉల్లి ధర పెరుగుతుందని భావించిన జిల్లాలోని బడా వ్యాపారులు ఇప్పటికే భారీగా ఉల్లిని స్టాకు పెట్టుకున్నట్టు సమాచారం. సాధారణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉల్లి సాగు నామమాత్రమే. పడమటి మండలాలకు చెందిన కొందరు రైతులు మాత్రం కూరగాయల పంటల్లో అంతరపంటగా ఉల్లిని విత్తుకుంటారు. సాధారణంగా ఉల్లి కర్నూలు, కర్ణాటకలోని బంగారుపేట, చిక్‌బళ్లాపూర్, చింతామణి, కోలారు, బెంగళూరు నుంచి ఉమ్మడి జిల్లాలోని తిరుపతి, చిత్తూరు, పుంగనూరు, పలమనేరు, కుప్పానికి చేరుతోంది.

అదుపులోకి రాని ధరలు

ఉల్లి ఘాటును ముందుగానే గ్రహించిన కేంద్ర ప్రభుత్వం ధరలను అదుపులోకి తేవాలని ఉల్లి ఎగుమతులపై నలభైశాతం సుంకాన్ని విధించింది. పైగా ఎగుమతులపై నిషేధాన్ని కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖ గత డిసెంబరు 31దాకా అమలు చేసింది. దేశంలోనే పెద్ద ఉల్లిమార్కెట్‌గా పేరున్న నాసిక్‌లో సుంకాన్ని తగ్గించాలని వ్యాపారులు నిరసనలు, ధర్నాలు చేసినా కేంద్రం దిగిరాలేదు.

ఘాటు కొడుతున్న వెల్లుల్లి..

గత నాలుగు నెలలు నుంచి వెల్లుల్లి ధరలు తగ్గడమే లేదు. ప్రస్తుతం కిలో వెల్లుల్లి కిలో రూ.400. దీంతో నెలకు కిలో కొనే సామాన్యుడు పావు కిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. హోల్‌సేల్ వ్యాపారస్తుల నుంచి సరుకు కొన్న రిటైల్ వ్యాపారులు వీటిని మూడు రకాలుగా విభజించి కిలో రూ.వంద, రూ.90, రూ.80 చొప్పున విక్రయిస్తున్నారు.

ఎందుకు ధరలు పెరిగాయంటే..!

ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాలు, నాసిక్, మహారాష్ట్రలో పంట దిగుబడి తగ్గింది. మరోవైపు వెల్లుల్లి ఏకంగా రూ.400 ఉండడంతో సగటు సామాన్యులు భయపడుతున్నారు. ఉల్లి పండించే మహారాష్ట్రలో వర్షాలకు పంట సీజన్ ఆలస్యమైనందున దిగుబడులు తగ్గి డిమాండ్ పెరిగింది. దీంతో ధరలు పెరుగుతున్నాయని ఇక్కడి హోల్‌సేల్ డీలర్లు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 950 దాకా కూరగాయల దుకాణాలు ఉన్నాయి. గతంలో నెలకు 80 లోడ్ల దాకా ఉల్లి బయటి ప్రాంతాల నుంచి వస్తుండగా ప్రస్తుతం 25 లోడ్లు మాత్రమే వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు.

ఉల్లి ధరలిలా..

జిల్లాలోని ప్రధాన మార్కెట్‌లలో గత నాలుగు నెలలుగా ఉల్లి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. అక్టోబరు నెల తొలివారంలో కిలో రూ.30 ఉండగా రెండోవారంలో రూ.40, మూడో వారంలో రూ.45కి చేరుకుని ఆఖరివారంలో రూ.52కు చేరింది. ప్రస్తుతం కిలో ఉల్లి రూ.60 నుంచి రూ.70 పలుకుతోంది. అయితే ఇందులో నాసిక్ కొత్తరకం చిన్నసైజు ఉల్లి హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.57గా ఉండగా పెద్దసైజు రూ.54గా ఉంది. అయితే రవాణా చార్జీలను కలిపి జిల్లాలోని పట్టణాలను బట్టి ధరలు పెంచి రీటైల్ వ్యాపారులు విక్రయిస్తున్నారు. గృహఅవసరాలు, హోటళ్లు, దాబాలు, మధ్యాహ్న భోజనం తదితరాలకు ఉల్లి వినియోగం పెరిగింది. దీంతో ఇక్కడి డిమాండ్‌కు సరిపడా సప్లయ్ లేక ధరలు పెరిగేందుకు కారణమైంది. కాగా ఈనెలలో తుపాన్ల కారణంగా ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు భావిస్తున్నారు.


ఈ ధరలతో కొన్నట్టే..!



ఎర్రగడ్డలు రెండో రకమే కిలో రూ.60, ఇక తెల్లగడ్డలు కిలో రూ.400గా ఉంటే ఎట్టాకొనేది ? ఇంటి సరుకుల కోసం బజారుకెళ్తే కూరగాయలు ధరలేమో అలా.. పోపు సామగ్రి ధరలూ అధికమే. పోనీ వీటిని చూద్దామంటే అసలు కొనలేము. ఇలాగైతే ఎలా వంటలు వండుకునేది ? ఏమి అర్థమే కావడం లేదు నాయనా.

– శాంతమ్మ, పలమనేరు

చౌకదుకాణాల్లో సరఫరా చేస్తే మేలు



ఉన్నట్టుండి ఉల్లి ధర రూ.60 దాటుతోంది. తెల్లగడ్డ ధర కిలో రూ.400కి చేరింది. వంటకు ఉల్లి ఉండాల్సిందే. మామూలుగా చౌకదుకాణాల్లో సరుకులు ఇస్తున్నట్టు ధర పెరిగినప్పుడు ఉల్లిగడ్డలను ప్రభుత్వం పంపిణీ చేస్తే మేలు. మొన్నటి దాకా టమాటా కొనలేని పరిస్థితి. ఇప్పుడేమో ఉల్లి, వెల్లుల్లి ఇలా ఉంటే సామాన్యులు కొనలేరు.

– చిట్టి, క్యాటిల్‌ఫామ్, పలమనేరు మండలం

ఉల్లి సప్లయ్ బాగా తగ్గింది..



కర్నూలు మార్కెట్‌కు ఈ సీజన్‌లో వచ్చే సరుకు బాగా తగ్గింది. ఈ ప్రాంతానికి పుంగనూరు నుంచి వచ్చే సరుకు కర్ణాటకలోని చిత్రదుర్గ్, చిక్‌మంగళూరు నుంచి వచ్చేది. అక్కడ ఉత్పత్తులు తగ్గాయి. మహారాష్ట్ర నుంచి సరుకు వచ్చి అక్కడ ధరలు తగ్గితేనే ఇక్కడ తగ్గుతాయి. అప్పటికీ సామాన్యులకు అందుబాటులో ఉండాలని ధర తక్కువగా ఉండే రెండు, మూడో గ్రేడ్ ఉల్లిని మేము తెప్పిస్తున్నాం. వీటికి కూడా రవాణా చార్జీలు ఎక్కువ. గనుక వీటిని కలిపి హోల్‌సేల్ ధరలు ఉంటాయి. మళ్లీ రీటైల్‌లో ఇంకొంచెం పెంచి విక్రయిస్తారు.

– అన్వర్, ఉల్లి వ్యాపారి, పలమనేరు

విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ముఖ్యం

- వన్ స్కూల్ అట్ ఏ టైం సంస్థతో ఎంఓయూ
- కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



ఓఎస్ఏటీ నిర్వాహకులతో ఎంఓయూ మార్చుకుంటున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం చాలా ముఖ్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వన్ స్కూల్ అట్ ఏ టైం సంస్థ నిర్వాహకులతో ఎంఓయూ మార్చుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ పాఠశాలల్లోని విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు ఎంఓయూ మార్చుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో ఎంపికైన 22 పాఠశాలల్లోని టీచర్లకు, విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణా తరగతులను సంస్థ నిర్వహిస్తుందని తెలిపారు. ఎంపికైన పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణ పొందే విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకుంటారని, ఉన్నత విద్య చదివే సమయంలో విద్యార్థులకు ప్రస్తుతం పొందుతున్న శిక్షణ నైపుణ్యాలు బాగా ఉపయోగపడుతాయని చెప్పారు. సంస్థ నిర్వాహకులు చేపట్టే శిక్షణ వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ విధానంలో కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఓఎస్ఏటీ సంస్థ సీఈఓ వాదిరాజ్ భట్, స్ట్రాటజీ అడ్వైజర్ కేదార్ శాస్త్రి (రిటైర్డ్ ఐఏఎస్), డైరెక్టర్ శృతి, జేటీ ధనంజయ్, డీఈఓ వరలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒంటరి ఏనుగు సంచారం

బంగారుపాళెం:మండలంలోని అటవీ సరిహద్దు గ్రామ రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. మండలంలోని మొగిలి దేవరకొండ సమీపంలో గల శివపార్వతుల గోశాల వద్ద ఒంటరి ఏనుగు సంచరించడాన్ని బుధవారం సాయంత్రం గుర్తించినట్లు తెలిపారు. అక్కడి నుంచి అడవిలోకి వెళ్లిపోయిందన్నారు. అటవీ సరిహద్దు గ్రామాలైన మొగిలి, గౌరీశంకరపురం, మొగిలివారిపల్లె, జయంతి, టేకుమంద, మామిడిమానుకుంట, కుంటిఆవులకుంట, కొదలమడుగు, సామచేనుమిట్ట, బండ్లదొడ్డి, కీమమంద రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 10 రోజుల క్రితం సామచేనుమిట్ట గ్రామంలో ఓ పూరిగుడిసెను ధ్వంసం చేసిన విషయం తెలిసిందేనన్నారు. రాత్రి సమయాల్లో రైతులు పొలాల వద్దకు వెళ్లరాదని సూచించారు.

'పరీక్షా పే చర్చ'ను విజయవంతం చేయండి

కార్వేటినగరం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాన్ని విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విజయవంతం చేయాలని జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యం అన్నారు. బుధవారం డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పరీక్షల ఒత్తిడిని తగ్గించి వారిలో ఆత్మవిశ్వాసం నింపడానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ ఏటా నిర్వహించే ×పరీక్షా పే చర్చ×లో పాల్గొనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఎంపిక కోసం 2024 డిసెంబర్ 14 నుంచి 2025 జనవరి 14వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా బహుళైచ్ఛిక ప్రశ్నల పోటీ నిర్వహిస్తారన్నారు. ఈ పోటీల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు, అదే విధంగా 6 నుంచి 12వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అనే మూడు కేటగిరీల్లో పాల్గొనవచ్చన్నారు. పోటీలో పాల్గొనదలిచిన వారు httpr://innovateindia1.mygov.in లింక్‌ను ఉపయోగించి తమ ఫోన్ నంబర్ లేదా మెయిల్ ఐడీ ద్వారా లాగిన్ అయి సమాచారాన్ని నింపాలన్నారు. ప్రశ్నలకు సమాధానం రాయడమే కాకుండా పరీక్షా పే చర్చ కార్యక్రమంలో ప్రధానమంత్రిని ఉద్దేశించి అడగదలచిన ప్రశ్నను 500 అక్షరాలకు మించకుండా సమర్పించాలన్నారు. ఈ ఎంట్రీల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి పరీక్షా పే చర్చ కార్యక్రమంలో ప్రధానమంత్రి సమాధాలు ఇస్తారన్నారు. ఇందుకోసం చిత్తూరు-తిరుపతి జిల్లాల్లోని అన్ని యాజమాన్య పాఠశాలలు, జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గణనాథా..నీ దర్శనానికి విఘ్నాలా ?

- ఓ భక్తుడు ఆదివారం రూ.500 చెల్లించి సాధారణ ఆశీర్వచన టిక్కెట్ తీసుకున్నాడు. ఈ టిక్కెట్‌తో ఇద్దరు వ్యక్తులు వెళ్లేందుకు అనుమతి ఉంది. అయితే ఆలయ సిబ్బంది కుట్టిబాబు ఈ టిక్కెట్‌పై ఒకరికే అనుమతి ఉందని చెప్పుకొచ్చాడు. దీంతో భక్తుడికి..సిబ్బంది మధ్య వాగ్వ్వాదం చోటు చేసుకుంది. ఆపై సిబ్బంది భక్తున్ని నోటికొచ్చినట్లు మాట్లాడాడు. దీంతో మనస్తాపానికి గురైన భక్తుడు ఓ మంత్రికి, ఈఓకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన ఈఓ పెంచల కిషోర్ కుట్టిబాబును తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు.
- భక్తులతో సిబ్బంది, హోంగార్డులు అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని కుప్పలు తెప్పలుగా ఎస్పీ మణికంఠ చందోలుకు సైతం ఫిర్యాదులు వెళ్లాయి. బ్రహ్మోత్సవాల సమావేశంలో ఈ విషయంపై ఆయన పదేపదే చర్చించారు. ప్రోటోకాల్ ఉన్న వ్యక్తులకు కనీస మర్యాదలు కల్పించాలని సూచించారు. భక్తులతో అమర్యాదగా ప్రవర్తించరాదని హెచ్చరించారు. ఇకపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని, భక్తులతో మంచిగా మాట్లాడాలని చెప్పుకొచ్చారు. లేనిపక్షంలో చర్యలు ఉంటాయని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు.

- భక్తులకు కనీస మర్యాద కరువు
- దురుసుగా ప్రవర్తిస్తున్న ఆలయ సిబ్బంది
- అయిన వారికే దర్శనం.. హారతి..
- అధికారులకు ఫిర్యాదుల పరంపర



కాణిపాకం: విఘ్నాలు తొలగించే వినాయకుడి దర్శనం కష్టమైంది. దర్శనార్థం వచ్చే భక్తులకు కనీస మర్యాదలు కరవుతున్నాయి. సిబ్బంది క్రమశిక్షణా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. భక్తులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. సొంత సేవలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. కొందరికే హారతి, తిలకం పడుతున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు పరంపర మొదలైంది. సిబ్బంది దురుసుతనాన్ని అట కట్టించాలని, భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తే.. చెక్ పెట్టాలని చూస్తున్నారు. సాధారణ రోజుల్లో భక్తుల సంఖ్య 10 వేలు దాటుతోంది. శని, ఆదివారాలు, పండుగ సమయాల్లో 30 వేలు దాటుతోంది.

భక్తులు అంటే అలుసా..!

స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ఉచిత దర్శనం, శీఘ్ర, అతిశీఘ్ర, వీఐపీ దర్శన సేవలను కల్పిస్తున్నారు. ఈ దారిలో మాత్రమే స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులకు అధికారికంగా అనుమతులు ఉన్నాయి. అయితే చాలామంది భక్తులు నిర్ణీత రుసుం చెల్లించి స్వామి దర్శనం చూసుకుని ఆశీర్వచనాలు, ప్రసాదాలు స్వీకరిస్తుంటారు. ఆలయంలోకి భక్తులు ప్రవేశించగానే గణేశుడి నామస్మరణతో ముందుకు వెళ్తుంటారు. ఇలాంటి తరుణంలో కొందరు సిబ్బంది ఏమియా.. రాయా.. పోయా ? అని కసురుకుంటారు. చిత్తూరు వాసులకు ఈ మాటలపై పెద్దగా పట్టింపు ఉండదు కానీ.. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు బాధపడుతున్నారు. ఇక కొందరు సిబ్బంది దురుసుతనంతో తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. గట్టిగా ప్రశ్నిస్తే ఎవడికి చెప్పుకుంటావో చెప్పుకో అనే సమాధానం వస్తుంది. ఇక టిక్కెట్లు ఉన్నా లోపలకు పంపడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. ప్రోటోకాల్ దర్శనంలో కూడా పూర్తిగా అలసత్వం వహిస్తున్నారు. సొంత సేవలు, దర్శనాలకు మాత్రం పరుగెత్తుతుంటారు. సొంత రూ.500, రూ.1000 పూజలకు ముఖ్యత్వం ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు తెల్ల చొక్కాలు వేసుకుని ఆలయ సిబ్బంది తరహాలోనే వ్యవహరిస్తూ.. స్వామి దర్శనాలు చేయించడమే పనిగా పెట్టుకుంటున్నారు. ఇందుకు కొందరు అధికారులు, సిబ్బంది సహకరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

సిఫార్సుతో వెళ్తే..

అక్కడ పనిచేసే కొందరు సిబ్బంది ద్వారా దర్శనానికి వెళ్తే దగ్గర ఉండి దర్శనాలు బాగానే చేయిస్తారు. ఆలయ ఎంట్రీ నుంచి గేట్లు చకచకా తెరుచుకుని వస్తుంటాయి. లోపల అర్చకుల చేత ఆశీర్వచనాలు, తిలకం, హారతి ఉంటాయి. సాధారణంగా వీఐపీ దర్శనానికి వెళ్లిన కనీసం హారతి కూడా దక్కదు. దేవున్ని అల చూసి.. ఇలా వచ్చేయాల్సిందే. చేతిలో రూ.500, రూ.1000 పడితే మర్యాదలకు కొదవ ఉండదని భక్తులు వాపోతున్నారు. దీనిపై జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి అధికారుల వరకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. పూర్తిస్థాయిలో నిఘా పెట్టారు.

హెచ్చరించాం..



దైవ సన్నిధిలో పని చేసే సిబ్బంది క్రమశిక్షణతో వ్యవహరించాలని చెప్పాం. భక్తులతో అమర్యాదగా మాట్లాడకూడదని పదే పదే గుర్తు చేస్తున్నాం. ఈ విషయమై మీటింగ్ పెట్టుకుని చెప్పాం. ఇకపై భక్తుల మనోభావాలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు ఉంటాయి. ఇకపై అలా జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందిస్తున్నాం. ఇంకేమైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్దుతాం.

– పెంచల కిషోర్, ఈఓ, కాణిపాకం

గుమ్మాలు కొట్టడం కక్ష సాధింపే



కూల్చేసిన ర్యాంప్‌ను పరిశీలిస్తున్న జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, మాజీమంత్రి రోజా

- దేశచరిత్రలో ఇలాంటివి చూడలేదు
- ఈ దుశ్చర్యకు టీడీపీ సిగ్గుపడాలి
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి
- ఐదేళ్లు మేము ప్రజలకు మంచి చేశాం
- దిగజారి ప్రవర్తిస్తున్న అధికారులపై ప్రైవేటు కేసులు వేస్తాం: మాజీమంత్రి రోజా

నగరి : జిల్లాలో టీడీపీ అకృత్యాలు మితిమీరిపోయాయని, గ్రామాల్లో గుమ్మాలు కొట్టేయడం వారి కక్ష సాధింపునకు పరాకాష్టగా నిలుస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి అన్నారు. మండలంలోని దామరపాకం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేతలు గణపతిశెట్టి, లీలారామ్ ఇళ్ల ముందు అధికారులు కూల్చేసిన ర్యాంప్‌లను బుధవారం మాజీ మంత్రి ఆర్కేరోజాతో పాటు వెళ్లి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నేతలతో స్థానికులు కలుపుగోలుగా ఉండడాన్ని ఓర్వలేక టీడీపీ నేతలు స్థానిక ఎమ్మెల్యే మద్దతుతో గడపను కొట్టడం దుర్మార్గమన్నారు. ఒక గ్రామంలోని ఇంటి ముందు గడపను కొట్టడానికి అధికారులు కూడగట్టుకుని రావడం భారతదేశంలో ఎక్కడా జరగలేదన్నారు. గ్రామాల్లో నోటీసులు ఇచ్చి కొట్టేయడం చాలా అరుదన్నారు. కాగితం అంటించడం.. కొట్టేయడం ఒకేసారి జరగడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు ఇబ్బందులు వస్తే పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. మాజీమంత్రి రోజమ్మపై అక్కసు, కసి కలగలిపి తమ పార్టీ కార్యకర్తలపై దాడికి పాల్పడుతున్నట్లు తెలుస్తోందని ఆరోపించారు. ఇది కొనసాగితే పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డిని గ్రామానికి తీసుకొస్తామన్నారు.

మేము మంచి చేస్తే.. వారు వేధిస్తున్నారు..



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దామరపాకంలో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్‌సెంటర్లు కట్టించామని, తాగునీరు అందించి మంచి చేస్తే.. కూటమి ప్రభుత్వం గుమ్మాలు కొట్టేస్తోందని మాజీ మంత్రి ఆర్‌కే రోజా ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలంగా ఉన్న నేతలను, ప్రజలకు అందుబాటులో ఉన్న నేతలను తప్పుడు కేసులతో వేధించడం, ఆస్తులు ధ్వంసం చేయడం, దారికి అడ్డంగా గోడలు కట్టడం లాంటి నీతిమాలిన చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాగ్దానాలు నెరవేర్చడం పోయి వేధించడం మొదలు పెట్టారన్నారు. దిగజారి ప్రవర్తిస్తున్న అధికారులపై ఆధారాలతో ప్రైవేటు కేసులు వేస్తామని ఆమె హెచ్చరించారు. ప్రతీ ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యుదయ యోజన పథకంపై సమీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హులైన ప్రజలు ప్రధానమంత్రి అనుసుచిత జాతి అభ్యుదయ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి అనుసుచిత జాతి అభ్యుదయ యోజన పథకంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ పథకంలో రుణాలు పొందిన వారికి డీఆర్‌డీఏ, ఎస్సీ కార్పొరేషన్లు కలిపి రూ.50 వేలు సబ్సిడీ అందిస్తాయన్నారు. ఈ పథకంలో ఎంపికైన లబ్ధిదారులు వ్యాపారాలను చేసుకుంటూ అభివృద్ధి చెందాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటి నుంచి చిన్న, పెద్ద తరహా వ్యాపారవేత్తలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. రూ.2 లక్షలు, ఆపై రుణం తీసుకునే లబ్ధిదారులకు రూ.50 వేలు సబ్సిడీ ఉంటుందన్నారు. 10 శాతం విరాళంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మిగిలిన మొత్తాన్ని నెలవారి కంతుల్లో చెల్లిస్తే భవిష్యత్తులో పెద్దమొత్తంలో రుణాలు పొందవచ్చని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ చాలా రోజుల తర్వాత ఎస్సీ కార్పొరేషన్ తరపున నిర్వహిస్తున్న మొదటి కార్యక్రమం అని చెప్పారు. చాలామంది రుణాలు తీసుకున్న తర్వాత పలు కారణాలతో చెల్లించలేక పోతున్నట్లు తెలిపారు. సకాలంలో రుణాలు చెల్లించిన వారంతా ప్రధానమంత్రి అనుసుచిత జాతి అభ్యుదయ యోజన పథకానికి అర్హులన్నారు. సమావేశంలో స్వయం సహాయక సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కేసు ఛేదనకు రాష్ట్రస్థాయి అవార్డు

చిత్తూరు అర్బన్: జిల్లాలోని గుడిపాల మండలంలో జరిగిన ఓ ఏటీఎం లూటీ కేసును ఛేదించి, ప్రధాన నిందితున్ని అరెస్టు చేసినందుకు రాష్ట్ర పోలీసుశాఖ ప్రముఖంగా ప్రదానం చేసే ఏబీసీడీ అవార్డుల్లో చిత్తూరు పోలీసులు మొదటి బహుమతిని కైవశం చేసుకున్నారు. బుధవారం మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ ద్వారకా తిరుమల రావు నుంచి చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు ఈ అవార్డును తీసుకున్నారు. ఈ ఏడాది జూలై 7న గుడిపాలలోని ఏటీఎంలోని దాదాపు రూ.26 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఇందులో పోలీసులకు దొరికిన క్లూ.. ఒకే ఒక్కటి.. అది నంబర్ లేని కారు. ముఖాలకు మాస్కులు ధరించిన ఓ గ్యాంగ్.. గ్యాస్ కట్టర్ల సాయంతో ఏటీఎంను లూటీ చేసి, నగదు దోచుకెళ్లారు. ఈ ఘటనను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు ఈ తరహా చోరీలు ఎక్కడ నమోదయ్యాయి..? అరెస్టయిన నిందితులు ఎవరు ? గుడిపాలలో జరిగిన



డీజీపీ ద్వారకా తిరుమలరావు నుంచి అవార్డు అందుకుంటున్న ఎస్పీ, గుడిపాల పోలీసులు

చోరీ సమయంలో పాత నేరస్తులు ఎక్కడ ఉన్నారు ? వంటి వివరాలను తెలుసుకోవడానికి దేశంలోని ఏడు రాష్ట్రాల్లో తిరిగారు. చివరకు హర్యాణా రాష్ట్రంలోని గతేరా ప్రాంతానికి చెందిన వసీం గ్యాంగ్ ఈ చోరీకు పాల్పడినట్లు గుర్తించారు. చిత్తూరుతో పాటు అనంతపురం, మహారాష్ట్ర, హర్యాణా రాష్ట్రాల్లో ఈ గ్యాంగ్ దాదాపు 12 చోరీలు చేసి, తప్పించుకు తిరుగుతున్నట్టు కనుక్కోగలిగారు. చోరీ జరిగిన 11 రోజుల తరువాత ప్రధాన నిందితుడు వసీంను పోలీసులు అరెస్టు చేశారు. చోరీ చేసిన డబ్బులు చేతులు మారడంతో రికవరీ చేయలేకపోయారు. చిత్తూరు పోలీసులు ఇచ్చిన క్లూతో అనంతపురం పోలీసులు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ కేసును ఛేదించినందుకు చిత్తూరు ఎస్పీతో పాటు గతంలో చిత్తూరు వెస్ట్ సీఐగా పనిచేసిన రవిశంకర్‌రెడ్డి, ఏఎస్ఐ దేవరాజులు, సిబ్బంది గోపి, నవీన్‌లు ఈ అవార్డును డీజీపీ చేతులు మీదుగా అందుకున్నారు.



ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోరా ?

- ఎంపీడీఓల తీరుపై కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆగ్రహం
- వచ్చే ఏడాది మార్చి 31 లోపు 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించాలి
- జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నిసార్లు చెప్పినా ఎంపీడీఓలు తీరు మార్చుకోవడం లేదని, క్షేత్రస్థాయి తనిఖీలు చేయకపోతే ఎలా అంటూ కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్షేత్రస్థాయిలో అమలవుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీఓలు తనిఖీ చేయకుండా అలసత్వం వహించడం మంచి పద్ధతి కాదని అసహనం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీడీఓల తీరు పట్ల ఫిర్యాదులు అందుతున్నాయని, ఇలాగే వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించేందుకు ఎంపీడీఓలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రూ.5 లక్షల్లోపు పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. ఈ నిధులు ఖర్చు కాకపోతే ఎంపీడీఓలే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

ఆ బాధ్యత ఎవరిది ?

గ్రామాల్లో కలుషిత నీటిని తాగడం వల్ల సమస్యలు ఎదురైతే బాధ్యత ఎవరు వహిస్తారని కలెక్టర్ ప్రశ్నించారు. అసలు మీరు క్షేత్రస్థాయిలో తనిఖీలకు వెళ్లి పరిశీలిస్తున్నారా లేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే జిల్లాలోని కొన్ని మండలాల్లో జాతీయ ఉపాధిహామీ పథకంలో అవకతవకలు జరిగినట్లు విజిలెన్స్ తనిఖీల్లో తేలిందని కలెక్టర్ వెల్లడించారు. ఈ విషయంలో ఎంపీడీఓలు సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలన్నారు.

మార్చి 31 లోపు నిధులు ఖర్చు చేయాలి..

జిల్లావ్యాప్తంగా 2025వ సంవత్సరం మార్చి 31వ తేదీలోపు 15 ఆర్థిక సంఘం నిధులను కచ్చితంగా ఖర్చు చేయాలని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామాల్లో పారదర్శకంగా ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అయితే మార్చి 31వ తేదీ లోపు నిధుల గడువు ముగుస్తుందన్న విషయాన్ని అధికారులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీపీ, జెడ్పీటీసీలకు తెలియజేయాలన్నారు. ఈ సమీక్షలో జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డ్వామా పీడీ రవికుమార్, హౌసింగ్ పీడీ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు

- స్పోర్ట్స్‌లో చాంపియన్‌షిప్‌గా నిలిచిన పలమనేరు జట్టు
- గేమ్స్‌లో ఎస్‌పీడబ్ల్యూ టీం ప్రతిభ
- ఓవరాల్ చాంపియన్‌షిప్ ఎస్‌పీడబ్ల్యూ తిరుపతి జట్టు
- 28న వైజాగ్ రాష్ట్ర పోటీలకు విజేతలు



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన జట్టుతో అధ్యాపకులు, నిర్వాహకులు

పలమనేరు: ఏపీ సాంకేతిక విద్యాశాఖ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఏటా నిర్వహించే ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ స్థానిక బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో రెండ్రోజులుగా జరుగుతున్న పోటీలు బుధవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా వాలీబాల్‌లో విన్నర్స్‌గా పలమనేరు జట్టు రన్నర్స్‌గా ఎస్‌పీడబ్ల్యూ, ఖోఖోలో విన్నర్స్‌గా ఎస్‌పీడబ్ల్యూ, రన్నర్స్‌గా పలమనేరు, టీటీ(సింగిల్స్)లో ఎసీపీడబ్ల్యూకు చెందిన రమ్య, రన్నర్స్‌గా ఎస్వీయూకు చెందిన అక్షయలు, డబుల్స్‌లో విన్నర్స్‌గా రమ్య, చరితారెడ్డి(ఎస్‌పీడబ్ల్యూ), రన్నర్స్‌గా ఛార్మి, కౌశిక(చంద్రగిరి), బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో విన్నర్‌గా శశికళ(పలమనేరు) రన్నర్‌గా చందన(కుప్పం), డబుల్స్‌లో విన్నర్స్‌గా శైలజ, శ్వేత రాధిక(ఎస్‌పీడబ్ల్యూ) రన్నర్స్‌గా లోహిత, శశికళ(పలమనేరు)నిలిచారు. చదరంగం పోటీలో అన్నపూర్ణ(ఎస్పీడబ్ల్యూ) విజేతగా నిలిచింది. ఇక స్పోర్ట్స్ విభాగంలో ట్రిపుల్ జంప్‌లో సంధ్య(పలమనేరు), లాంగ్ జంప్‌లో షణ్ముఖప్రియ(చంద్రగిరి), హైజంప్‌లో నవ్యశ్రీ(పుత్తూరు), డిస్క్‌త్రోలో వెంకటమానస(శ్రీవిద్యానికేతన్, రంగంపేట) షాట్‌పుట్‌లో ఇందుప్రియ(కుప్పం), వందమీటర్ల, 200 మీటర్ల రన్నింగ్‌లో బిందుశ్రీ(ఎస్వీయూ), 400, 800 మీటర్లలో షణ్ముఖప్రియ(చంద్రగిరి), 100 మీటర్ల రిలేలో ఎస్వీయూ పాలిటెక్నిక్ విద్యార్థులు గెలుపొందారు. గేమ్స్‌లో ఓవరాల్ చాంపియన్స్‌గా ఎస్పీడబ్ల్యూ(తిరుపతి), స్పోర్ట్స్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (పలమనేరు) నిలిచారు. ఇండివీజువల్ చాంపియన్‌షిప్‌ను షణ్ముఖప్రియ దక్కించుకోగా, ఓవర్‌ఆల్ చాంపియన్‌షిప్‌ను ఎస్పీడబ్ల్యూ కళాశాల దక్కించుకుంది. ఇందులో 12 ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, ప్రైవేటు మహిళా కళాశాలకు చెందిన 175 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇక్కడ గెలుపొందిన జట్లు ఈనెల 28న వైజాగ్‌లో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నారు. ఇందులో గెలుపొందిన వారిని కదిరి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రమ, స్థానిక కళాశాల ప్రిన్సిపల్ మహమూద్ అభినందించారు. ఈ సందర్భంగా మహిళా పాలిటెక్నిక్ అధ్యాపకులకు సైతం పలు రకాల క్రీడా పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పీడీలు ఆయా కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

బీమా నమోదు గడువు పెంపు

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లాలో మామిడి పంటకు ప్రభుత్వం కల్పించిన బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈనెల ఆఖరు వరకు గడువును పొడిగించామని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి రైతులు పంటకు బీమా చేసుకునేందుకు ఎకరాకు రూ.1750 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ మొత్తాన్ని బ్యాంకు, మీ సేవా సెంటర్, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా ప్రీమియం నగదు చెల్లించవచ్చన్నారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధుడి మృతి




మృతి చెందిన వెంకటేశులు(ఫైల్)

పాలసముద్రం : మండలంలోని వనదుర్గాపురం ఆదిఆంధ్రవాడకు చెందిన వృద్ధుడు(70) కే.వెంకటేశులు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. వనదుర్గాపురం ఆదిఆంధ్రవాడకు చెందిన వెంకటేశులు గ్రామానికి తాగునీరు కోసం మోటారు ఆన్ చేసేందుకు వెళ్లాడు. అయితే స్టార్టర్‌కు అమర్చిన విద్యుత్ తీగలను ఎలుకలు కొరికేసిన విషయం తెలియక ముట్టుకోగానే అక్కడే పడిపోయాడు. విషయం తెలిసి కుటుంబ సభ్యులు వెంకటేశులును ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోని అత్తిమ్మజేరిపేట మృతి చెందాడు. ఈ విషయం తెలిసి వనదుర్గాపురం సర్పంచ్ నరసింహరాజు రూ.10 వేలు అంత్యక్రియల కోసం ఆర్థికసాయం అందించారు.

సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలు తెలపండి

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పీఈటీ కేడర్‌ల ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాల్లో అభ్యంతరాలుంటే తెలపాలని డీఈఓ వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్స్, ఎస్జీటీ, పీఈటీలకు ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాను ఈ నెల 18వ తేదీన డీవైఈఓ, ఎంఈఓలకు పంపినట్లు పేర్కొన్నారు. ఆ జాబితాల్లో ఏవైనా పొరబాట్లు ఉన్నట్లైతే సంబంధిత ఆధారాలతో లిఖిత పూర్వకంగా ఈనెల 19వ తేదీ సాయంత్రంలోపు తెలియజేయాలన్నారు. గడువు అనంతరం వచ్చే అభ్యంతరాలను స్వీకరించమని డీఈఓ వెల్లడించారు.

భూమి సారవంతంతోనే దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ

బంగారుపాళెం: రైతులు భూమిని సారవంతంగా పెట్టినప్పుడే నాణ్యమైన పంట దిగుబడులను సాధించేందుకు అవకాశం ఉందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని తుంబపాళెంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు వివిధ పంటల్లో సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. పంటల సాగులో నేల స్వభావం, సాంద్రతను తెలియజేసే భూసార పరీక్షలు చేపట్టాలన్నారు. అందుకు అనుగుణంగా భూమిని సారవంతం చేసే జీవన ఎరువులను వినియోగించాలన్నారు. నాణ్యమైన విత్తనాలు, యాజమాన్య పద్ధతులు, వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. సాయిల్ హెల్త్ స్కీమ్ గురించి అవగాహన కల్పించారు. అలాగే పంటల బీమా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ చిట్టిబాబు ఏఈఓ సాదరయ్య, వీహెచ్ఎస్ సుమతి, వీఎస్ఏ యుగంధర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.